# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-04-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లాలో జరిగే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఈరోజు పాల్గొంటారు.**

2. **హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబులిటీ కేంద్రగా ఆవిష్కరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంప్రదాయ ఆయుర్వేద విధానానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయని వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు.**

4. **తెలంగాణలో "రాజీవ్ యువ వికాసం" పథకం గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు**

5. **ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు బాపట్ల జిల్లాలో పర్యటిస్తారు. సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా జిల్లాలోని చినగంజాం మండలం గొల్లపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ముఖ్యమంత్రి ఈ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

--------------------------

విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో మూడో కొలిమిని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఉక్కు కర్మాగారాన్ని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గుంటూరు జిల్లా ఉండవల్లిలోని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి నిన్న చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కర్మాగారంతో రాష్ట్రానికి భావోద్వేగ అనుబంధం ఉందని అన్నారు. కర్మాగారాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణను రూపొందిస్తాయన్నారు. ప్లాంటు నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు.

--------------------------

హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబులిటీ కేంద్రగా ఆవిష్కరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే తొలి కార్యాలయాన్ని వ్యాన్‌గార్డు సంస్థ హైదరాబాద్‌లోనే స్థాపించనున్నట్లు వెల్లడించింది. వ్యాన్‌గార్డు సంస్థ ప్రతినిధులు నిన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ కార్యాలయం అందుబాటులోకి వస్తే.. కృత్రిమ మేధా, డేటా సెంటర్, మొబైల్ ఇంజినీరింగ్ నిపుణులకు అవకాశాలు లభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. తద్వారా 2500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆ సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

-----------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంప్రదాయ ఆయుర్వేద విధానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నాయని వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరులో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, 9 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ ఆసుపత్రులకు 24 కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. దేశంలో ఆయుర్వేద రంగంలో 52 వేల స్టార్టప్ లు వచ్చాయని మంత్రి వివరిస్తూ,

వాయిస్…32 సెకన్లు

-----------------------------

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "రాజీవ్ యువ వికాసం" పథకం గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ నుంచి ఈ పథకంపై జిల్లా కలెక్టర్లతో ఆయన దృశ్య మాధ్యమ సమావేశాన్ని నిన్న నిర్వహించారు.దరఖాస్తుల స్వీకరణ నుంచి చివరి వరకు నిరుద్యోగ యువతకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

-----------------------------

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025 కార్యక్రమం ఈరోజు నుంచి ఢిల్లీలో ప్రారంభం కానుంది. మూడు రోజులు పార్టీ జరిగే ఈ కార్యక్రమాన్ని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. దేశ వ్యాప్తంగా 75 వేలకు పైగా యువత మై భారత్ పోర్టల్ ద్వారా వివిధ విభాగాల కింద ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వీడియో దరఖాస్తులను సమర్పించిందని తెలియచేసింది. యువత కోసం నిర్వహించే యూత్ పార్లమెంట్‌లో జరిగే చర్చలు పంచుకొనే అభిప్రాయాలు దేశ భవిష్యత్ పురోభివృద్ధికి దోహదం చేస్తాయని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

-----------------------------

ప్రజా సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అనకాపల్లిలో పర్యటించిన మంత్రి నిన్న అచ్చుతాపురం నుండి అనకాపల్లి వరకు నిర్మించనున్న నాలుగు వరుసలు రహదారి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రహదారిని విస్తరణ పనులను చేపట్టామని అన్నారు. పరిశ్రమలు రావడం ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

-----------------------------

తెలంగాణలో 280 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి జరుగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

కుమార్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నౌకాశ్రయం నుంచి ఫిలిప్పిన్స్ దేశానికి తెలంగాణ బియ్యంతో వెళుతున్న నౌకను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా బియ్యం ఎగుమతుల తీరును ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో ప్రజా పంపిణీ అవసరాలు తీరిన తర్వాత మిగిలిన బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నామని వెల్లడించారు. ఫిలిప్పిన్స్‌తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా తొలి విడతగా 12 వేల 500 టన్నుల బియ్యం పంపిస్తున్నామని ఆయన తెలియజేస్తూ,

..వాయిస్..32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 'అన్నదాత సుఖీభవ' కింద 20 వేల రూపాయలను రైతులకు అందజేయనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో కోటి 18 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన కోసమే పి4 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. పంట కాలువల సాగు నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్-ఐపీఎల్ లో భాగంగా లక్నో వేదికగా ఈ రోజు లక్నో సూపర్ జెయింట్స్ , పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. కాగా నిన్న ముంబై వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్, ముంబై ఇండియన్స్ జట్ల జరిగిన మ్యాచ్ లో 8 వికెట్ల తేడాతో ముంబై విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ 16.2 ఓవర్లలో 116 పరుగులను చేసింది. ఆ తర్వాత 117 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబై జట్టు 12.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసి విజయం సాధించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు నుంచి 2025-26 ఇంటర్ విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈరోజు నుంచి తరగతులు మొదలు కానున్నాయి. అలాగే ప్రథమ సంవత్సరంలో చేరే వారికి 7వ తేదీ నుంచి అడ్మిషన్లు మొదలవుతాయని అధికారులు తెలిపారు. కాగా ఈ నెల 23 వరకు తరగతులు నిర్వహించి వేసవి సెలవులిస్తారు. అనంతరం జూన్ 2న తిరిగి క్లాసులు పున: ప్రారంభం కానున్నాయి. అలాగే జూనియర్ కళాశాలల పని వేళలనూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించింది.

---------------------------

కంటి చూపు ప్రాధాన్యతను తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ రోజు నుండి వారం రోజుల పాటు అంధత్వ నివారణా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. 1960 వ సంవత్సరం నుండి ఏప్రిల్ ఒకటి నుండి ఏడవ తేదీ వరకు దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. కంటి చూపు ఎంతో విలువైనది. నేత్రాలను పరిరక్షించుకునే విషయంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వివిధ కంటి గాయాలు, దృష్టి లోపాలు, వాటి నివారణా చర్యలు, చికిత్సా విధానాలు, కళ్ళను ఆరోగ్యవంతంగా పరిరక్షించుకోవడం వంటి అంశాలపై ఈ వారం రోజుల పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కంటి ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థ లు ప్రజలకు అవగాహన కల్పిస్తాయి.

=====================